ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 05 జులై , 2026 | పేజీలు : 5

## ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



**ప్రజాపక్షం/మునుగోడు** : మునుగోడు మండలంలోని ఇప్పర్తి గ్రామంలో గ్రామానికి చెందిన గోలి లింగస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరై ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆధ్యాత్మికత మనిషికి మానసిక ప్రశాంతతను, ధైర్యాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భవనం మధుసూదన్ రెడ్డి, బొడిగ అశోక్,తిరుపారి వెంకటేశ్వర్లు,గోసుకొండ లింగయ్య, చాపల శ్రీనుతో పాటు గ్రామ పెద్దలు, భక్తులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రుణాల మంజూరులో పారదర్శకం

### కమిషనర్ శ్రీజారెడ్డి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వం మంజూరు చేసే వివిధ రకాల సబ్సిడీ , ఆర్థిక రుణాలు అర్హులైన లబ్ధిదారులందరికీ సక్రమంగా అందేలా బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ మునిసిపల్ కమిషనర్ నర్ర శ్రీజారెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె పాల్గొని స్వయం సహాయక సంఘాల రుణాల ప్రగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీజారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను మిర్యాలగూడ పట్టణ పరిధిలోని 350 మహిళా సంఘాలకు సుమారు 50.70 కోట్ల రూపాయల రుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు 44 స్వయం సహాయక సంఘాలకు 7.30 కోట్ల రూపాయల మేర రుణాలను పంపిణీ చేయడం జరిగిందని వెల్లడించారు. మెప్మా విభాగ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను సకాలంలో నెరవేర్చేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. రుణాల మంజూరు ప్రక్రియలో ఎలాంటి స్వార్థానికి, అవకతవకలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.మహిళా సంఘాల సభ్యులు తాము తీసుకున్న రుణాల రీపేమెంట్ సకాలంలో పూర్తి చేయాలని, తద్వారా బ్యాంకుల్లో మంచి క్రెడిట్ పొంది అదనపు నిధులతో మరిన్ని పెద్ద రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అదేవిధంగా, పట్టణంలోని వీధి వ్యాపారుల జీవనోపాధి వృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆమె పేర్కొన్నారు. పీఎం స్వనిధి పథకం ద్వారా దాదాపు 500 మంది వీధి వ్యాపారులకు 50 వేల రూపాయల చొప్పున రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, వారందరికీ క్రెడిట్ కార్డు సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మెప్మా డీఎంసీ శివాజీనాయక్, టీఎంసీ బక్కయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి, సతీష్ మరియు పట్టణంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుల సంక్షేమమే పిఆర్‌టియు ధ్యేయం

### ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/తిప్పర్తి** : తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సంక్షేమ పిఆర్‌టియూ సంఘం ధ్యేయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు.రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం కోసం ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించే అన్ని యజమానియాల పాఠశాల ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడడమే పిఆర్టియు లక్ష్యమని దానితోపాటు ఉపాధ్యాయుల హక్కులను సాధించడానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. శనివారం మండల కేంద్రంలోని సంఘ సభ్యత నమోదు కార్యక్రమంలో భాగంగా మోడల్ స్కూలుకు విచ్చేసిన ఎమ్మెల్సీ ఉపాధ్యాయుల ను ఉద్దేశించి మాట్లాడుతూ త్వరలోనే ఉద్యోగ ఉపాధ్యాయులకు పిఆర్‌సి ప్రకటన వచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని. దీంతోపాటు ఎంతోకాలంగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు వేచి చూస్తున్న 010 విధానాన్ని అమలు చేయిస్తామన్నారు. మోడల్ స్కూల్‌ను పరిశీలించి పాఠశాలలో నెలకొన్న మౌలిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో పిఆర్‌టియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర భిక్షంగౌడ్,కోమటిరెడ్డి నరసింహారెడ్డి,కాలం నారాయణ రెడ్డి,మేకల జానారెడ్డి,గాదె వెంకట్ రెడ్డి,కిరణ్ కుమార్,మండల అధ్యక్షులు నామిరెడ్డి మహేందర్ రెడ్డి,గుర్రం రవి,గోపాల్,విజయ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**Mandal wise Cumulative Integrated Rainfall Report of Suryapet from 01-06-2026 to 30-06-2026 (in mm)**

| SNo. | Mandal Name | Integrated Rainfall from 01-06-2026 to 30-06-2026 | | | | Deviation | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | Normal | Actual | Pre. Year Actual | Rainy Days | Actual on Normal | Status | Actual on Pre. Year Actual |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | Nagaram | 121 | 157.7 | 53.5 | 8 | 30 | Excess | 195 |
| 2 | Thirumalagiri | 121.4 | 130.9 | 34.6 | 8 | 8 | Normal | 278 |
| 3 | Thungathurthi | 122.7 | 221.5 | 69.3 | 12 | 81 | Excess | 220 |
| 4 | Maddirala | 106.9 | 175.2 | 38.8 | 11 | 64 | Excess | 352 |
| 5 | Noothankal | 103.1 | 179.4 | 42.8 | 15 | 74 | Excess | 319 |
| 6 | Jajireddigudem | 112.2 | 175.2 | 38 | 12 | 56 | Excess | 361 |
| 7 | Suryapet | 107.7 | 94.7 | 54.8 | 11 | -12 | Normal | 73 |
| 8 | Atmakur_S | 97.8 | 105.3 | 41.9 | 8 | 8 | Normal | 151 |
| 9 | Mothey | 66.3 | 108.7 | 34.9 | 9 | 64 | Excess | 211 |
| 10 | Chivvemla | 85 | 92 | 38.6 | 9 | 8 | Normal | 138 |
| 11 | Penpahad | 87.6 | 97.6 | 55.3 | 7 | 11 | Normal | 76 |
| 12 | Munagala | 103.3 | 96.1 | 86.3 | 7 | -7 | Normal | 11 |
| 13 | Nadigudem | 95.8 | 94.3 | 50.4 | 5 | -2 | Normal | 87 |
| 14 | Ananthagiri | 91 | 151 | 69.3 | 6 | 66 | Excess | 118 |
| 15 | Kodad | 94.6 | 106.2 | 118.9 | 6 | 12 | Normal | -11 |
| 16 | Chilkur | 87.5 | 106.2 | 74.6 | 8 | 21 | Excess | 42 |
| 17 | Garidepalle | 89.4 | 102.7 | 64.7 | 12 | 15 | Normal | 59 |
| 18 | Neredcherla | 86.8 | 87.1 | 36.8 | 6 | 0 | Normal | 137 |
| 19 | Palakeedu | 88.4 | 64.8 | 23.4 | 4 | -27 | Deficit | 177 |
| 20 | Mattampalle | 68.8 | 168.9 | 47.1 | 7 | 145 | Excess | 259 |
| 21 | Huzur nagar | 93.7 | 122.2 | 43.6 | 6 | 30 | Excess | 180 |
| 22 | Mellachervu | 84.4 | 89.7 | 83.7 | 7 | 6 | Normal | 7 |
| 23 | Chinthala palem | 80.4 | 42.4 | 23 | 6 | -47 | Deficit | 84 |
| District Rainfall | | 95.5 | 120.3 | 53.2 | 14 | 26 | Excess | 126 |

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా సూర్యాపేట జిల్లాలో ఆశించిన వర్షాలు లేవు. కారుమబ్బులు కమ్ముకున్నా ఎల్‌నినో ప్రభావంతో చిరుజల్లులు మాత్రమే పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా నమోదైన వర్షపాతంలో వైవిధ్యం కనిపి స్తుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ మాసంలో జిల్లాలో సాధారణ వర్షపాతం 95.5 మీ.మీ. కాగా 120.3 మీ.మీ. వర్షం కురిసిందని లెక్కలు చెబుతున్నారు. ఈ లెక్కలను బట్టి చూస్తే సాధారణం కన్నా 24.8 మీ.మీ. వర్షాలు ఎక్కువగా కురిసాయని స్ప ష్టం అవుతున్నా ఆ పరిస్థితులు మాత్రం ఎక్కడా కనపడడం లేదు. సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు తాము పంట సాగు ఎలా చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

–ప్రజాపక్షం/సూర్యాపేట

## న్యాయం చేయాలని కలెక్టరేట్ ఎదుట దీక్ష



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** భూవివాదంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన పాల్వాయి పరిపూర్ణ, పరుశురాములు శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌కు వినతిపత్రం సమర్పించి విలేకరులతో మాట్లాడారు. పోలుమల్ల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 37/ఏఏ 1/2లో 35గుంటలు, 37/ఏఏ 1/1/2లో 5గుంటల పట్టా భూమిని కోర్టు తీర్పు మేరకు సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ భూమికి సంబంధించి తమకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చినప్పటికి, భూమితో ఎలాంటి సంబంధం లేని కొందరు వ్యక్తులు తూనికి సోమయ్య, సత్తయ్య, లింగయ్య, మల్లయ్య, వీరి కుమారులు ఉపేందర్, సతీష్, మధు, భార్గవ్, ఇమ్మడి నాగయ్యలు అక్రమంగా తమ పొలంలోకి ప్రవేశించి బోర్ మోటారు, స్టార్టర్, విద్యుత్ వైర్లు ధ్వంసం చేయడంతోపాటు ఫెన్సింగ్‌ను కూల్చివేశారని ఆరోపించారు. అంతేకాకుండా తమను చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘటనపై మద్దిరాల పోలీస్ స్టేషన్ ఎస్ఐ వీరయ్యకు ఫిర్యాదు చేసినప్పటికి ఆయన స్పందించలేదని, అవతలి వ్యక్తులకు మద్దతుగా వ్యవహరిస్తూ తమ ఫిర్యాదును పట్టించుకోలేదని ఆరోపించారు. అనంతరం సిఐ, డిఎస్‌పి, ఎస్‌పి అధికారులకు కూడా సమాచారం అందించినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు. అయినప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ, పోలీసు ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



## పార్టీ బలోపేతానికి కృషి

**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరిని కలుపుకొని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర రైతు కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, టిపిసిసి ఎస్సీ డిపార్టుమెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మందుల సూర్యకిరణ్ అన్నారు. శనివారం తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ప్రతి ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేసి పార్టీ గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 9 మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజక వర్గ నాయకులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డిలకు సన్మానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణ కేంద్రంలో విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్ కుమార్ యాదవ్, విద్యుత్ శాఖ అకౌంట్స్ అధికారి కళ్లెం శ్రీనివాస్‌రెడ్డిలను సంఘం ప్రతినిధులు శనివారం ఘనంగా సత్కరించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మారం శ్రీనివాస్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల రక్షణకు సంఘం నిరంతరం కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ కోకన్వీనర్లు దాసరాజు జయరాజు, చేగొండి మురళి యాదవ్, కంపసాటి మధు, శశికాంత్, అంజయ్య, భూమా యాదవ్, రాజేష్, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

## అనంతగిరి కాంగ్రెస్ పార్టీకి మళ్లీ కొత్త ఊపు

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ముస్కు శ్రీనివాసరెడ్డి ఎన్నికైన సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించారు. శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతం అవుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నందిగా మ శ్రీనివాసగౌడ్, తెల్లబెల్లి పిఏసిఎస్ చైర్మన్ బుర్ర వెంకటేశ్వర్లు, ఎస్వీ కళాశాల చైర్మన్ గద్దె రఘు, మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షులు గుండ్లపల్లి వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షులు గుండ్లపల్లి వెంకన్న, కంటు వేణు, చుండూరు మురళి, దాములూరి మురళి, నాగమల్లి పాల్గొన్నారు.



## నాటుసారా తయారీ స్థావరంపై పోలీసుల దాడి



10 లీటర్ల బెల్లం పానకం, నాటుసారా తయారీ సామాగ్రి ధ్వంసం
2 లీటర్ల సారాయి స్వాధీనం

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండలంలోని తమ్మారం గ్రామంలో నాటుసారా తయారీ స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేసి 10 లీటర్ల బెల్లం పానకం, నాటుసారా తయారీ సామాగ్రిని ధ్వంసం చేసి 2 లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకున్నారు. తమ్మారం గ్రామానికి చెందిన శేషం రామ కృష్ణ అనే వ్యక్తి కృష్ణానది ఒడ్డున ఉన్న బీడు భూమిలో నాటుసారా తయారీ చేయడానికి సారా బట్టి ఏర్పాటు చేసినట్లు పోలీసులకు సమాచారం అందడంతో స్పెషల్ బ్రాంచ్ పోలీస్ సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ పరమేష్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నాటుసారా, ఇతర నిషేధిత పదార్థాల తయారీ, విక్రయాలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. మండలంలో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, రవాణా చేసినా వారిపై కఠినమైన చర్యలుంటాయన్నారు. సారా తయారు చేస్తున్న నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఎంఆర్‌పి ధరలకే ఎరువుల విక్రయాలు జరగాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీ ధరలకే అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి వళ్ళోజు వినోద్ కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని శ్రీ సాయి మహేశ్వర ఫర్టిలైజర్, కిసాన్ సీడ్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ఎరువుల నిల్వలు, విక్రయ విధానం, ధరల పట్టికలు, స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను మోసగించే విధంగా అధిక ధరలకు విక్రయాలు చేయడం, అక్రమ నిల్వలు ఉంచడం, నకిలీ ఉత్పత్తులను విక్రయించడం వంటి చర్యలను వ్యవసాయ శాఖ ఏమాత్రం ఉపేక్షించదని తెలిపారు. ప్రతి డీలర్ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం



ప్రోత్సహిస్తున్న బీపీటీ5204 (సాంబా మసూరి), ఆర్ఎన్ఆర్15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కెఎన్ఎం1638, డబ్ల్యూజీఎల్ 44, కెఎన్ఎం7715 వంటి వరి రకాలను రైతుల్లో విస్తృతంగా ప్రాచుర్యం కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి ఋషేంద్రమణి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపరేషన్ అడ్డాలో కోదాడ పట్టణ పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/కోదాడ:** ఆపరేషన్ అడ్డాలో భాగంగా కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 3న రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు, ఈ తనిఖీల్లో రాత్రి 11 గంటల తర్వాత రోడ్లపై అనవసరంగా సంచరిస్తున్న యువకులు, గుంపులుగా చేరి కాలక్షేపం చేస్తున్న వారిని గుర్తించి, వారి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి తాత్కాలికంగా స్వాదీనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కోదాడ సిఐ శివశంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రజలు ముఖ్యంగా యువత రాత్రి 11 గంటల తర్వాత సరైన కారణం లేకుండా రోడ్లపై సంచరించుండా సహకరించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని, ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు, సంరక్షులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆపరేషన్ అడ్డాలో భాగంగా పట్టుబడిన యువకుల తల్లిదండ్రుల సమక్షంలో ప్రవర్తనలో మార్పు తీసుకురావడంలో అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



## పోలీస్ అంటే ధైర్యం, భరోసా కల్పించే వ్యవస్థ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పోలీస్ అంటే సమాజంలో శాంతిభద్రతలకు ప్రతీక మాత్రమే కాదు ప్రజలకు ధైర్యం, భరోసా కల్పించే వ్యవస్థ అని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు పోలీస్ పరేడ్‌లో ఆయన హాజరై గౌరవ వందనం స్వీకరించి, పరేడ్‌ను నిశితంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ దర్బార్ నిర్వహించి సిబ్బందికి ఎదురవుతున్న విధి నిర్వహణపరమైన, వ్యక్తిగత సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అందరూ వివాదాలకు దూరంగా ఉంటూ ప్రజలకు, బాధితులకు ఉత్తమమైన పోలీస్ సేవలు అందించి, గౌరవంగా ఉండాలన్నారు. ఈ వారాంతపు పరేడ్ ద్వారా పోలీసు పనితీరుపై పోలీస్ సిబ్బందిలో పరస్పర సమన్వయం, క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడుతుం





దన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్, ఆర్మ్‌డ్ రిజర్వ్ అడ్మిన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, ఏఆర్ విభాగపు అధికారులు, పోలీసు సిబ్బంది, సూర్యాపేట టౌన్, రూరల్ సర్కిల్ ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, చివ్వెంల స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులను బెంబేలెత్తిస్తున్న మోటార్ దొంగలు

### పోలీసులకే సవాల్ విసురుతున్న చోర ముఠాలు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో మోటార్ దొంగల బెడద రోజు రోజుకు పెరుగుతుంది. పంటలకు ప్రాణాధారమైన బోరు మోటార్లనే లక్ష్యంగా చేసుకున్న చోర ముఠాలు అర్ధరాత్రి వేళ పొలాల్లోకి చొరబడి క్షణాల్లోనే మోటార్లను విప్పుకుని ఉడాయిస్తున్నారు. వరుస చోరీలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు పంట సాగు చేయడానికి ఖర్చులు, మరోవైపు విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్న రైతులకు ఇప్పుడు మోటార్ దొంగలు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నారు. వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన మోటార్లు ఒక్క రాత్రిలోనే మాయమవుతుండటంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు నారు పోశారు. నారుమళ్లకు నీరందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందోమోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా గరిడేపల్లి మండల పరిధిలోని గంగానగర్‌లో గత రెండు రోజుల క్రితం బాలెం సైదులు, నట్టెజ్యోతి, పాలెం చెన్నయ్య, మైలారి సోమిరెడ్డి, సైదాబి, కంభం అంజిరెడ్డి, నర్సయ్య, వంగాల సైదిరెడ్డి, కంభం రామకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి




**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ ప్రభుత్వాన్ని, పరిశ్రమల యాజమాన్యులను కోరారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేళ్ళచెరువు ప్రాంతంలో ఉన్నపరిశ్రమలు స్థానిక వనరులను వినియోగించుకుని అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఆ పరిశ్రమల్లో స్థానిక యువతకు తగిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు, సామాజిక బాధ్యతను గుర్తించి స్థానిక అర్హులైన యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వర్షకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోయిన నవీన్, భావన నవీన్, మేళ్లచెరువు మండల కార్యదర్శి ఆది నారాయణ వీరబాబు, అనిల్, నరేష్, అభిరామ్, తుమ్మ సతీష్, గడ్డం వినోద్, సురేందర్, ఉత్తేజ్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

## దశదిన కార్యక్రమంలో దైద

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గుండాల నరసింహా గౌడ్ తండ్రి గుండాల కృష్ణయ్య గౌడ్ దశదిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గట్టు నరేందర్,మాజీ వార్డ్ మెంబర్ బత్తుల రమేష్,సుందర్,సోషల్ మీడియా ఇన్చార్జ్ గుండాల శివ, శాంతి,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇల్లు పేద కుటుంబాలకు వరం

**ప్రజాపక్షం/చండూరు:** ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఒక వరంలాంటిదని సర్పంచ్ ముక్కాంల వెంకన్న యాదవ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వద్దగోని చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లును బొడ్డు హరికృష్ణ నిర్మించుకొని శనివారం గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా బొడ్డు హరికృష్ణ దంపతు లను కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కాంల వెంకన్న యాదవ్ , ఉప సర్పంచ్ సి హెచ్ ఊషయ్య , కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వద్దగోని చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులందరూ ఫార్మల్ డ్రెస్ కోడ్‌ను పాటించాలని మండల విద్యాశాఖ అధికారి చత్రునాయక్ ఆదేశాలు జారి చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశా లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు టీషర్టులు, జీన్స్, టోపీలు ధరించి విధులకు హాజరుకావద్దన్నారు. మహిళ ఉపాధ్యాయులు సంప్రదాయ చీరలోనే విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఉపాధ్యా యుడి వ్యక్తిత్వమే విద్యార్థికి తొలి పాఠం అనే భావ నతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, భారతీయ సంస్కృతి, వృత్తి గౌరవాన్ని పెంచే దిశగా ఈ నిర్ణయాన్ని అమలు చేస్తు న్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

**ప్రజాపక్షం/త్రిపురారం :** సమాజంలో చదువుతోనే ఉత్తమమైన గుర్తింపు వస్తుందని బెంగళూరు వైట్ ఫీల్డ్ డిసిపి హడావత్ సైదులు అన్నారు. శనివారం మండ లంలోని రూప్లతండా గ్రామానికి చెందిన మండల యువ కాంగ్రెస్ నాయకులు ధనవ తురవికుమార్ ఆర్థిక సహకారంతో మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లా దారు.ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందు తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధి కారి రవి నాయక్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుముల శ్రీనివాస్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు అల్లంపల్లి జానయ్య,మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి,కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి, సర్పంచ్ వెంకట్ రామ్ నాయక్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.



## అభివృద్ధి సంక్షేమాలు ప్రజలకు అందేలా కృషి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా పటిష్టం చేస్తూ అభివృద్ధి సంక్షేమాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని ప్రభుత్వ విప్ డిసిసి జిల్లా అధ్యక్షులు బీర్ల ఐలయ్య యాదవ్ తనకు దిశా నిర్దేశం చేసినట్లు పోచంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ తెలి పారు. మండల పార్టీ అధ్యక్షునిగా తనను ఎంపిక చేసి నందుకు కృతజ్ఞత తెలుపడానికి ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి సన్మానించారు. నూతనంగా ఎన్నికైన తనను శాలువాతో ఘనంగా సన్మానించి ఆశీర్వదించినట్లు చెప్పారు. ఈ సంద ర్భంగా డిసిసి జిల్లా అధ్యక్షులు తనను నిత్యం ప్రజా సేవలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేసే



మంచి నాయకుడిగా ఎదగాలనీ ఆకాంక్షించి పలు అంశాల పట్ల చర్చించినట్లు తెలిపారు.

## జడ్‌పి డిప్యూటీ సిఇఒకు వినతిపత్రం



**ప్రజాపక్షం/రామన్నపేట :** మునిపంపుల గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వ హిస్తున్న జూనియర్ అసిస్టెంట్ డిప్యుటేషన్ ఇతర చోటుకు పంపిన నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసి, విద్యార్థుల మరియు పాఠశాల పరిపాలనా అవస రాల దృష్ట్యా అదే పాఠశాలలో కొనసాగించాలని కోరుతూ మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం, సీపీఎం గ్రామ శాఖ ఆధ్వ ర్యంలో భువనగిరి జిల్లా పరిషత్ కార్యాల యంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివా స్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ వెంకటేశం మాట్లా డుతూ జూనియర్ అసిస్టెంట్ డిప్యుటేషన్ కారణంగా పాఠశాల పరిపాలనా పనులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, విద్యార్థులు,ఉపాధ్యాయులు, తల్లిదం డ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు తొలుపునూరి శ్రీనివాస్, సీపీఎం గ్రామశాఖ కార్య దర్శి తాళ్లపల్లి జితేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, నాయకులు గంటెపాక శివకు మార్, మేడి ముకుంద, పుట్టల ఉదయ్ కుమార్, అప్పం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదిక సాక్షిగా రైతన్నలను అవమానించిన అధికారి

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మేళ్లచెరువు మండలంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలోని అధికారులు రైతు వేదికలో రైతులకు పత్తి విత్తనాలు ఇస్తామంటూ మెసేజ్‌లు పెట్టి రైతులను అక్కడికి రప్పించి విత్తనాలు సరఫరా పేరుతో వారిని దారుణంగా అవమానించచా రని ఇక్కడ రైతులు అంటున్నారు. ఎకరా ఒక్కంటికి నాలుగు ప్యాకెట్లు అంటూ కొంతమంది రైతులకు మాత్రమే విత్తనాలు అందించారు. కాని అధికారులు మాత్రం ముందొచ్చిన వారికి మాత్రమే విత్తనాలు సర ఫరా అయ్యాయని షూటుగా సమాధానం చెప్పారు. ఇందుకు రైతులు సానుకూలంగా సరే మేడం మరి అందని వారికి విత్తనాలు ఎప్పుడు అందిస్తారు? మరల విత్తనాలు వచ్చే అవకాశం ఒదా.? అని అడగ్గా ఇందుకు అగ్రికల్చరల్ ఆఫీసర్ విత్తనాలు లేవు ఏమీ లేవు గ్రూప్‌లలో మెసేజ్ పెట్టవద్దు అన్నా కూడా మెసేజ్ పెట్టారు అంటూ మరొక అధికారితో అంటూ ఫ్రీగా వస్తే ఫినాయిల్ అయిన తాగడానికి రెడిగా ఉంటారు వీళ్ల అందే మాటను పదే పదే సార్లు అంటూ ఉచితంగా ఇస్తామంటే ఇంతమంది వచ్చారు చూడు అని రైతులను దారుణంగా మాట్లాడారు. ఆ అధికారి ప్రభుత్వం ద్వారా వచ్చిన సబ్సిడీ విత్తనాలు కదా ఎక్కువ ఉత్పత్తి వచ్చే అవకాశం ఉంటుంది కదా అని రైతులు ఆశతో ఆఫీస్ వద్దకు వస్తే ఎదురైన అవ మానం తలుచుకుని విచారం వ్యక్తం చేస్తున్నారు. రైతులను ఇంత దారుణంగా అవమానించిన ఆ అధి కారి వ్యవహార శైలిపై అధికారులు చర్యలు తీసుకోవా లని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## పూర్ణగిరి దేవాలయ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** యాదాద్రి భువన గిరి జిల్లా భువనగిరి మండలం నమాత్పల్లి గ్రామం లోని శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయంలో నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. వరుసగా రెండో సారి చైర్మన్గా ఎన్నికైన రావి సురేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నమాత్పల్లి గ్రామంలోని శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయ నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముం దుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ చైర్మన్గా వరుసగా రెండోసారి ఎన్నికైన రావి సురేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా, ధర్మకర్తలుగా జిట్టా రాజిరెడ్డి, యెల్లంల నరసింహ యాదవ్, మట్ట బాలకృష్ణ గౌడ్, సురపంగ శ్యామల వెంకటేష్, ఆలయ ప్రధానార్చ కులు, ఎక్స్ అఫిషియో సభ్యులు జ్యోషి పవన్ కుమార్ శర్మ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా మా ట్లాడిన రానున్న రోజుల్లో ఆలయాన్ని మరింత అభి వృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి.వి రమేష్ తెలిపారు. లంపి స్కిన్ (ముద్ద చర్మ) వ్యాధి నివారణలో భాగంగా శని వారం మండలంలోని నోముల గ్రామంలో నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా 98 పశువులకు లంపి నివారణ టీకాలు వేశారు.టీకాల ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లంపి స్కిన్ డిసీజ్ కాప్రిపాక్స్ వైరస్ వల్ల వచ్చే అంటువ్యాధి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ జె. రాంరెడ్డి,పశుసంవర్ధక సహాయకురాలు డి. మౌనిక,పశు సంవర్ధక సహాయకుడుకె.భానుచందర్ పాల్గొన్నారు.





## పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

### కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండలంలోని శనివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. వాయిలసిం గారం గ్రామానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు మొత్తం రెండు లక్షల 42,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్న కుటుంబాలకు అండగా నిలవడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. వైద్య ఖర్చులు అత్యవసర పరిస్థితుల్లో ఈ సహాయం ప్రజ లకు గొప్ప ఊరట నిస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి, బుర్రా పుల్లారెడ్డి, దేగ కొండయ్య పాల్గొన్నారు.

## జర్నలిస్టు పిల్లల ఫీజు రాయితీ సర్క్యులర్‌కు 6న జిల్లావ్యాప్తంగా నిరసనలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలో జర్నలిస్టు కుటుంబ సభ్యుల పిల్లల పాఠశాల విద్య కోసం ఫీజు రాయితీ సర్క్యులర్ జారీ చేయ డంలో విద్యాశాఖ నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 6న అన్ని మండల, డివిజన్, నియోజకవర్గ, జిల్లా కేంద్రంలో నిరసనలు ధర్నాలు చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేయాలని టియు డబ్ల్యూజె(ఐజేయు)జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి పిలుపుని చ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ ఆధ్వ ర్యంలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కలెక్టరేట్లో డిఆర్ఓకు, జిల్లా విద్యాశాఖ అధికారికి జూన్ 5వ తేదీన వినతిపత్రం సమర్పిం చడం జరిగింది అన్నారు. అయితే పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా ఫీజు రాయితీ సర్క్యులర్ ఇవ్వడంలో కాల యాప న చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అనేక జిల్లాలలో సర్క్యులర్ ఇవ్వగా,నల్లగొండ జిల్లాలో మాత్రం కమిషనరేట్ నుంచి అనుమతి రావాలంటూ జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొనడం విచారకర మన్నారు. సర్క్యులర్ జారీ అయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా దశల వారి ఆందోళన విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో రామన్నపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి రత్న కుమారి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు చట్టాల పట్ల అవగా హనా కలిగి ఉండాలని, వివిధ చైల్డ్ లేబర్ యాక్ట్,పోక్సో యాక్ట్,బాల్య వివాహాలపై, మరియు మైనర్స్ డ్రైవింగ్ చేయడం వంటి అంశాలపై పూర్తి అవగాహనా కలిపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రామన్నపేట అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ జన రల్ సెక్రటరీ యాదాసు యాదయ్య అధ్యక్షతన సీనియర్ అడ్వకేట్స్ నకిరేకంటి మొగులయ్య, పాల్వంచ జగతయ్య, సతీష్ రెడ్డి, పాఠ శాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్, మరియు కోర్ట్ సిబ్బంది ఎండీ ఖౌసిఫ్, భార్గవ్, పోలీస్ శాఖ నుండి రామాచారి,నరేష్ మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



## వాటర్ ఫిల్టర్ అందజేత

ప్రజాపక్షం/రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు మంచినీటిని అందించే ఉద్దేశంతో 1,50,000 విలువ గల వాటర్ ఫిల్టర్ ను వీర్ బ్యాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు వెల్లంకి వాస్తవ్యులైన డాక్టర్ ఎల్ల ఆనంద్ రెడ్డి సూచనతో అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి ఈదెం రాధా శ్రీనివాస్,వెటర్నరీ డాక్టర్ జ్యోత్స్న, ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ టి సురేందర్ రెడ్డి,కంపెనీ ఏరియా మేనేజర్ ఎం.తిరుపతి రెడ్డి,వీర్ బ్యాక్ కంపెనీ ప్రతినిధులు సంతోష్,ఉమా మహేష్, శివకుమార్,గోపాలమిత్ర మల్లేష్ మరియు రాజేందర్ మరియు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పత్తి విత్తనాల పంపిణీ



ప్రజాపక్షం/మునుగోడు : ప్రభుత్వం కాటన్ కపాస్ కాంతి పథకం కింద 100 సబ్సిడీపై రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలను అందజేశారు. మండలంలోని కలవలపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.పద్మజ రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ వంటి రసాయన ఎరువులను సిఫారసు చేసిన మోతాదులోనే వాడాలని సూచించారు.అధికంగా ఎరువులు వేయడం వల్ల భవిష్యత్తులో వ్యవసాయ భూములు నిస్సారమవుతాయని తెలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మాధగోని నరసింహ గౌడ్, రైతులు వెంపల్ల సాయిలు,పంతంగి లక్ష్మయ్య,సివర్ల పాపయ్య, ఒంటెపాక సైదులు, కన్నెబోయిన శంకర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమం

ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ : 2026/2027 సంవత్సరానికి గాను పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం తిరుమలగిరి సాగర్ మండలంలోని అల్వాల యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభమైంది.రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు సక్రు నాయక్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మొక్క పరుశురాం గౌడ్, ప్రధాన కార్యదర్శి కూన్ రెడ్డి సైదిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మంకెన రామచంద్రారెడ్డి, మంత్రాల సురేందర్ రెడ్డి, మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాళం అరుణకుమారి,రాష్ట్ర కార్యదర్శి గిన్నె వెంకట్ రెడ్డి, ఎం.డి. ఫరీద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జార్జి, కె. ఆనందగిరి, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ఎస్‌టియు-టిఎస్ లక్ష్యం



ప్రజాపక్షం/నల్లగొండ(దామరచర్ల) : రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న బదిలీలు,పదోన్నతులు,పిఆర్‌సి బకాయిల చెల్లింపు,ఖాళీ పోస్టుల భర్తీ, పని భారం తగ్గింపు, సేవా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్‌టియుటిఎస్ జిల్లా ఆర్థిక కార్యదర్శి కొనకంచి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.దామరచర్ల మండలం ఎంపీపీఎస్ కల్లేపల్లి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ధనావత్ రవీంద్రనాయక్ ఎస్‌టియూ సభ్యత్వాన్ని స్వీకరించారు. సంఘం చేపడుతున్న ఉద్యమాలు,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిపై విశ్వాసంతోనే ఆయన సభ్యత్వం స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్.రామ్ సింగ్, అడిషనల్ జనరల్ సెక్రటరీ ఏ.తావుర్య, మిర్యాలగూడ మండల శాఖ అధ్యక్షుడు అంబటి వీరనారాయణ,ప్రధాన కార్యదర్శి వలిశెట్టి విజయభాస్కర్,త్రిపురారం మండల అధ్యక్షుడు కడారి శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి ఆర్.బాలు తదితరులు పాల్గొన్నారు.

## టిబి లేని సమాజం నిర్మిద్దాం



ప్రజాపక్షం/మోటకొండూర్ : టిబి, మధుమేహం లేని సమాజం కోసం ప్రజలు కృషి చేయాలని మోటకొండూర్ పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ కట్టా విజయ్ అన్నారు. ఆయన శనివారం మండలంలోని ముత్తి రెడ్డి గూడెంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో పాల్గొని ఎన్‌సిడి స్క్రీనింగ్ శిబిరము సర్పంచ్ బాలరాజు,ఉప సర్పంచ్ వెంకన్న, వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, సకాలంలో పరీక్షలు నిర్వహించడం, తగిన చికిత్స అందించడం ద్వారా టీబి రహిత భారతదేశ లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. మధుమేహం రక్తపోటు వంటి వ్యాధుల నిర్ధారణ కోసం స్క్రీనింగ్ పరీక్షలు, ఎక్స్రే పరీక్షలు నిర్వహించారు. మొత్తం 119 అవుట్ పేషెంట్స్ పాల్గొనగా 64 మందికి ఎక్స్రే పరీక్షలు, 13 మందికి కల్లె పరీక్షలు, ఇతరులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. మిగతా వారికి రిపోర్టులు వచ్చాక అవసరమైన మందులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ.బి.వైద్య సిబ్బంది జ్యోతి ఎస్‌టిఎస్, నటేష్ ఎస్‌టిఎల్‌ఎస్, ఉమేష్ ఎక్స్‌రే టెక్నీషియన్‌తో పాటు నిక వైద్య సిబ్బంది సుహాసిని, అరుణ, ఆశ కార్యకర్తలు మంజుల, జానమ్మ,,సీడ్స్ ఎన్జీవో సంస్థ ప్రతినిధులు కలమ్మ స్రవంతి,పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, సానిటేషన్ సిబ్బంది రాములు భాగ్యమ్మ రజిత తదితరులు పాల్గొన్నారు. సహకారమందించిన ప్రతి ఒక్కరికి, గ్రామ ప్రజలకు డాక్టర్ విజయ్ ధన్యవాదాలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం నకిరేకల్ మండల,టౌన్ కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, తిప్పర్తి రోడ్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు.ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ బాలికల పాఠశాల క్రీడా మైదానంలో వర్షపు నీరు నిల్వ ఉండటం,రహదారి నీరు పాఠశాలలోకి చేరడం,వంటగది పొగ తరగతి గదుల్లోకి రావడం వల్ల విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.వంటగదిని వేరే ప్రాంతానికి మార్చడంతో పాటు డైనింగ్ హాల్ నిర్మించాలని కోరారు.తిప్పర్తి రోడ్డులోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడంతో పాటు అదనపు తరగతి గది నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈకార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్,టౌన్ కార్యదర్శి ఒంటెపాక వెంకటేశ్వర్లు,మండల కమిటీ సభ్యులు బహరోజు ఇందిరా,ఒంటెపాక కృష్ణ, సాకుంట్ల నరసింహ,గింజల లక్ష్మి,ఒంటెపాక జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు నాయకత్వ నైపుణ్యాలే పునాది



ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి, సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా చేయడమే లక్ష్యంగా వాయిస్ 4 శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా సాధికారత, స్వేచ్ఛ, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్, నైపుణ్యాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న మహిళలకు సమాజంలో నాయకత్వ పాత్రను ఎలా పోషించాలి, సమస్యలను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలి, సమర్థవంతమైన సంభాషణ ద్వారా ప్రజల్లో అవగాహన ఎలా పెంచాలనే అంశాలపై నిపుణులు వివరించారు. మహిళలు తమ హక్కులను తెలుసుకొని ఆర్థిక, సామాజిక, వ్యక్తిగత రంగాల్లో మరింత ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు తమ అభిప్రాయాలను పంచుకుంటూ, ఇలాంటి శిక్షణలు గ్రామీణ మహిళల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచడంతో పాటు నాయకత్వ లక్షణాలను మరింత మెరుగుపరుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం కవిత, హెచ్ డబ్ల్యు ఓ శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వాయిస్ టీమ్, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



## ప్రజా గొంతుక మూగబోయింది

ప్రజాపక్షం/నకిరేకల్ : ప్రజా గాయకుడు,అరుణోదయ కళాకారుడు నాగన్న మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఖమ్మంలో నాగన్న భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.జీవితాంతం పేద ప్రజల పక్షాన పాటల ద్వారా చైతన్యం కలిగించిన నాగన్న సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఆయన ఆలపించిన పాటలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఈసందర్భంగా పలువురు కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు నాగన్నకు ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో గాదగోని కొండయ్య, వేముల పుష్ప,నిర్మల,వసంత,రాయి కృష్ణ, లతీఫ్,గజ్జ రవి,చెరుకు సతీష్,సాగర్, నరేందర్,సురేందర్ పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలకు శ్రీకారం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: నిరుపేదలు, అణగారిన వర్గాల ప్రజల హక్కుల రక్షణ కొరకు నిరంతరం శ్రమిస్తూ ప్రజాసేవే పరమావధిగా భావించి సమాజ శ్రేయస్సు కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వంగవీటి మోహనరంగా ఆశయ సాధనలో భాగంగా ఆయన పేరుతో ప్రత్యేక చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి విస్తృతంగా సేవా కార్యక్రమాలు అందించనున్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని ఎన్ఆర్ఆర్ మునిసిపల్ కాంప్లెక్స్ ఆవరణలో వంగవీటి రంగా జయంతి సభను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వంగవీటి రంగా భారీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రేణులు ఘనంగా అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు తిరందశెట్టి కోటేశ్వరరావు, తిరుమలగిరి వజ్రం, పందిరి వేణు, భీమం నాయుడు, రేబెల్లి లోహిత్, దుండిగాల బాబీ, తిరుమలగిరి అంజి, మేకల అంజి, బచ్చలకురి శ్రీనివాస్, వెంకటనాయుడు, వేణు, అభినాయుడు, అశోక్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల విరాళం

ప్రజాపక్షం/వేములపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఉగ్గే మునేశ్వర్ ఉగ్గే శివ లు తన తండ్రి బసవ లింగయ్య 27వ వర్ధంతి సందర్భంగా పాఠశాల అభివృద్ధి కోసం 25వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు 5000 రూపాయలు ప్రోత్సాహ బహుమతి అందజేస్తామని అన్నారు, భవిష్యత్తులో పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ మునీశ్వర్‌ను శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు రమణారెడ్డి, ప్రభాకర్, ఉపేందర్,సుధాకర్,రామకృష్ణ,వాణిశ్రీ, యాదమ్మ,శాంతకుమారి,నాగశ్రీ,నాగమణి,ప్రభాకర్ రెడ్డి,వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



# దొడ్డికొమరయ్య స్ఫూర్తితో ఉద్యమిద్దాం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రధాత దొడ్డి కొమరయ్య అని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శనివారం నేరేడుచర్ల ప్రధాన కూడలిలో దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆకారపు వెంకటేశ్వర్లు, కుంకు తిరపయ్య, బొడ్డుపల్లి సుందరయ్య, రాపోలు నవీన్, చిలకరాజు శ్రీను, ఇంజమూరి మల్లయ్య, కొప్పు లక్ష్మి నారాయణ, పరికె భరత్, కొమ్రాజ్ వెంకట్, బత్తిని శ్రీనివాస్, పిల్లలమర్రి పుల్లయ్య, తక్కెళ్ల నాగార్జున పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో సిపిఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపెల్లి సైదులు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, నాయకులు ఎల్గూరి గోవింద్, వెల్పుల వెంకన్న, జె. నరసింహారావు, వీరబోయిన రవి, మామిడి సుందరయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమరయ్య వర్ధంతిని మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన గరిడేపల్లిలో ఎంఎస్ భవన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో కొమరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్బంగా అధికారికంగా తాజ్ పూర్ లో ఆ మహనీయున్ని స్మరించు కుంటూ తాజ్ పూర్ కురుమ సంఘం ఆధ్వర్యంలో వారి విగ్రహానికి గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో సామాజిక వేత్త డా॥ ర్యాకల శ్రీనివాస్, కురుమ సంఘం నాయకులు, కుల పెద్దలు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.







**ప్రజాపక్షం/నకిరేకల్ :** తెలంగాణ సాయుధ పోరాటానికి అగ్నిజ్వాలగా నిలిచిన అమరవీరుడు దొడ్డి కొమురయ్య త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫసర్ బెల్లి యాదయ్య అన్నారు.శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలసి ఘనంగా నివాళులు అర్పించారు. చరిత్ర శాఖాధ్యక్షులు కె. ప్రవీణ్ రెడ్డి సంధానకర్తగా వ్యవహరించినఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగు,అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసాచారి,శ్రీనివాస్,మధుసూదన్ రెడ్డి,నర్సింహాచారి, శివశంకర్,సుభాషిణి,కార్యాలయ సిబ్బంది వెంకన్న,సుదర్శన్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి శివకుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్ కుమార్, పేర్ల నాగయ్య, వంటికొమ్ము సంతోషిమాత, ఐతరాజు పద్మ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గుండాల;** దొడ్డి కొమురయ్య ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని గుండాల మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి





సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వెంకన్నగౌడ్, నూనెగూడెం సర్పంచ్ కొండమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సమాజంలో వెనుకబడిన, అణగారిన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం, సామాజిక దోపిడీపై నిరంతరం పోరాడటమే అమరవీరుడు దొడ్డి కొమరయ్యకు ఇచ్చే అసలైన నివాళి అని యాదవ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం మిర్యాలగూడలోని యాదవ సంఘ భవనంలో దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సంస్మరణ సభను యాదవ సంఘం, యాదవ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సరనాల వెంకన్న యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు పుట్టపాక శ్రీనివాస్ యాదవ్, గంగుల బిక్షం యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ జంగా క్ష్మ ణ్ యాదవ్, యాదవ ఉద్యోగుల సంఘం నాయకులు జానపాటి శ్రీనివాస్, యాదవ సంఘం మిర్యాలగూడ మండల అధ్యక్షులు గుడిపాటి వెంకటేశ్వర్లు, యాదవ యువజన సంఘం నాయకులు బచ్చనబోయిన మహేష్, నాగేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు :** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా శనివారం మునుగోడు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న దొడ్డి కొమరయ్య విగ్రహానికి కేవైసీయస్ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు.జిల్లా ఇన్చార్జి బండారు శంకర్ ఆధ్వర్యంలో నాయకులు విగ్రహానికి పూలమాలలు వేసి అమరుడి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కేవైసీయస్ మునుగోడు మండల అధ్యక్షులు బండారు శ్రీనివాస్, బండారి పాండరి, కేవైసీయస్ కోశాధికారి నెట్టు శంకర్, సహాయ కార్యదర్శి బండారు మహేష్, పాలకూరి అశోక్, ఉప్పునూతల శ్రీశైలం, అందుగుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఎలాంటి తప్పులు లేకుండా సర్వే

**ప్రజాపక్షం/త్రిపురారం :** మండలంలో చేపడుతున్న ఎస్ఐఆర్ (సర్) సర్వేను ఎలాంటి తప్పులు,లోపాలు లేకుండా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం మండలంలోని చెన్నాయిపాలెం,దుబ్బ తండా,రాగడప,మాటూరు గ్రామాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించి, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు.సర్వే నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు, వివరాల లోపాలు లేదా నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అత్యంత బాధ్యతతో విధులు నిర్వర్తించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గాజుల ప్రమీల,సూపర్వైజర్ ప్రవీణ్,జీపీఓలు,బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపులు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన కర్నె రేణుక ఎటువంటి తోడు, ఆధారం లేకుండా జీవనం సాగిస్తున్న నేపథ్యంలో



ఒంటరి మహిళ అయిన రేణుకకు ఇప్పటికి ఇళ్లు లేకపోవడంతో పూరీ గుడిసెలో కాలం వెళ్ళదీస్తున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు ఒంటరి మహిళ అయిన రేణుకకు రెండవ విడతలోనైనా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ఆమె కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, అధికారులను, నాయకులను వేడుకుంది. నిరుపేద కుటుంబానికి చెంది, పూరిగుడిసెలో ఉంటున్న, నిరుపేదనైన కూడా మొదటి దశ ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తనకు ఇళ్లు రాలేదని అధికారులు ఇప్పటికైన స్పందించి రెండవ దశ ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తనకు ఇళ్లు మంజూరు చేయాలని వేడుకుంది.

## మండల అధ్యక్షుడిగా అనిల్



**ప్రజాపక్షం/వేములపల్లి:** ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడిగా పుట్టల అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, మండల కేంద్రంలోని అంబేద్కర్ యూత్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఎంఆర్‌పిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంఎస్‌పి,ఎంఆర్‌పిఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్చార్జి బకరం శ్రీను మండల అధ్యక్షుడిగా పుట్టల అనిల్‌ను ఏకగ్రీవంగా నియమిస్తున్నట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల ప్రకారం మాదిగ జాతి అభివృద్ధి కోసం కృషి చేస్తానని,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట పట్టణ కేంద్రంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ భూ లీల సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవం వేడుకల్లో జెల్ల రజనీ వెంకటేశు దంపతులు మూలమూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించినారు. హోమ కార్యక్రమంలో గరిక రాధిక సత్యనారాయణ(సర్పంచ్) ఉప సర్పంచ్ మొటె రమేష్, ఆలయ చైర్మన్ ఉపేందర్ జానకి, కొంపల్లి సుమలత సురేష్, సిద్ధం లక్ష్మీ బాయి లింగయ్య, రాపూల్ రాజశేఖర్ పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయిలో మెరిసిన మిర్యాలగూడ క్రీడాకారుల ప్రతిభ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నూకల చారిటబుల్ ట్రస్ట్, ఎన్‌వీఆర్ & బీఎల్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ద్వారా శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి మిర్యాలగూడకు గుర్తింపు తీసుకువచ్చారని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నెల రోజుల పాటు కోకో క్రీడలో ప్రత్యేక శిక్షణ పొందిన కేంద్రియ విద్యాలయ విద్యార్థులు హైదరాబాద్‌లో జరిగిన రీజినల్ పోటీల్లో 32 జట్లు పాల్గొన్న పోటీలో మూడో స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎమ్మెల్యే సన్మానించారు. డిస్కస్ త్రో విభాగంలో ఆర్. వినీత బంగారు పతకం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే కే. రూప, మధుబాను, లహరి, రియాజ్, అభిసాయి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం మిర్యాలగూడ క్రీడా రంగానికి గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఎన్‌వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నూకల వేణుగోపాల్ రెడ్డి, శిక్షణ అందించిన కోచ్‌ల బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో షేక్ అజారుద్దీన్, గోదాల జానకి, గడగోజు అశోక్ చారి, కోదాటి అనిల్, నామ రవీందర్, సతీష్, నాగరాజు, లక్ష్మ ణ్, బీఎల్‌ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.